కోనుగోలు కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

తూకంలో కోతలు విధిస్తే చర్యలు

■ ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

వెంకటాపూర్, మే 23 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తూకంలో కోతలు విధిస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ఇలా త్రిపాఠి హెచ్చరించారు. గురువారం ఆమె అదనపు కలెక్టర్ మహేందర్‌జీతో కలిసి మండలకేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో, మిల్లులో యజమానులు రైతులను ఇబ్బందులకు గురి చేస్తే సహించేదిలేదన్నారు. అలా ఎవరైనా చేస్తే వెంటనే 9347416178 హెల్ప్‌లైన్ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని రైతులకు సూచించారు. అకాల వర్షాల నేపథ్యంలో తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని సెంటర్ ఇన్‌చార్జిలను ఆదేశించారు. రైస్ మిల్లల వద్ద ధాన్యం కోత లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని రైతులు పండించిన 100 శాతం ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. ప్లయింగ్ స్క్వాడ్ బృందాలు, స్థానిక అధికారులు నిరంతరం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై మేనేజర్ బీ రాంపతి, డీసీవో సర్దార్‌సింగ్, మండల ప్రత్యేక అధికారి శ్రీపతి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్

■ రైతులకు కొనుగోలు రసీదులు ఇవ్వాలి
■ భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా
■ విత్తన వ్యాపారులతో సమావేశం
■ హాజరైన ఎస్పీ కిరణ్ ఖరే

భూపాలపల్లి రూరల్, మే 23 : నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా విత్తన వ్యాపారులను హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్‌లో నకిలీ విత్తనాల నియంత్రణకు చేపట్టవలసిన చర్యలపై ఎస్పీ కిరణ్‌ఖరేతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు డీలర్లు, ఫెర్టిలైజర్ షాపు యజమానులు నకిలీ, కాలం చెల్లిన విత్తనాలు, ఎరువులు, నిషేధిత పురుగు మందులు విక్రయించొద్దన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం నడుచుకోవాలని, రైతులకు నష్టం కలిగిస్తే సహించబోమన్నారు. నకిలి, కాలం చెల్లిన విత్తనాలు, ఎరువులు, నిషేధిత పురుగు మందుల విక్రయాలు జరగకుండా వ్యవసాయ అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. నకిలీ విత్తనాలు అరికట్టడానికి జిల్లాలో పోలీసు, వ్యవసాయశాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక టాస్క్ ఫోర్స్ టీంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని, విత్తనాలు అమ్మేటప్పుడు రైతులకు రసీదులు ఇవ్వాలని, ఓఎల్ఎంఎస్ పోర్టల్‌లో స్టాక్ అమ్మకం వివరాలు నమోదు చేయాలన్నారు. గత సంవత్సరం విత్తనాలు, పురుగు మందుల నిల్వలుంటే వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. ఎస్పీ కిరణ్ ఖరే మాట్లాడుతూ గతంలో జిల్లాలో 6 కేసులు నమోదు చేశామన్నారు. భూపాలపల్లి మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు జిల్లా కావడంతో కొంత మంది ముఠాలుగా ఏర్పడి రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నారని తెలిపారు. నకిలీ విత్తనాలు విక్రయించే వారి వివరాలను రైతులు పోలీసులకు తెలపాలన్నారు. సరైన ప్యాకింగ్ లేకుండా రకరకాల పేర్లతో ఉన్న విత్తనాలను రైతులు కొనొద్దని ఎస్పీ సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి విజయ భాస్కర్, ఫెర్టిలైజర్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా

పాఠశాలల పనులు పూర్తి చేయాలి

మల్హార్, మే 23 : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం మండలంలోని కొండంపేట, కొయ్యూరు, తాడిచెర్ల ఎస్సీకాలనీ, పీవీ నగర్ పాఠశాలల పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల ఆవరణలో వివిధ రకాల పండ్ల మొక్కలను నాటాలని సూచించారు. పాఠశాల పునః ప్రారంభం నాటికి అన్ని పనులను పూర్తి చేసి పాఠశాలలను ఆహ్లాదకరంగా తయారు చేయాలన్నారు. అనంతరం కొండంపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి తడిసిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని కలెక్టర్ రైతులకు భరోసా ఇచ్చారు. పీవీ నగర్ సమీపంలోని ఇసుక రీచ్‌ను సందర్శించి పేదల ఇండ్ల నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని తహసీల్దార్ రవికుమార్‌ను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీపీ మలహాల్‌రావు, మండల ప్రత్యేకాధికారి అవినాష్, ఎంపీడీవో శ్యాంసుందర్, పీఆర్ ఏఈలు, వీవోఏలు ఉన్నారు.

నేడు పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష

భూపాలపల్లి రూరల్/కాటారం, మే 23 : జిల్లాలో శుక్రవారం జరగనున్న పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని భూపాలపల్లి జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ శ్యాంప్రసాద్, కాటారం ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ గోవర్ధన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 953 మంది విద్యార్థులు పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షకు హాజరుకానున్నారని, వీరి కోసం భూపాలపల్లి పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, సంఘమిత్ర డిగ్రీ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష జరుగుతుందని, గంట ముందు నుంచే కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతిస్తామన్నారు. హాల్‌టికెట్‌పై ఫొటో ప్రింట్ కాని వారు వెంట పాస్‌పోర్టు సైజు ఫొటో తీసుకురావాలన్నారు.

ములుగులో..

ములుగు రూరల్ : ములుగు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బండారుపల్లి మోడల్ పాఠశాలలో పాలిసెట్ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కోఆర్డినేటర్ డాక్టర్ కొప్పుల మల్లేశం తెలిపారు. మొత్తం 675 మంది విద్యార్థులు పరీక్ష రాస్తున్నట్లు పేర్కొన్నారు. కాగా, పరీక్షా కేంద్రాలను గురువారం ఆయన జిల్లా అసిస్టెంట్ కోఆర్డినేటర్ కే రజినీలత, స్పెషల్ అబ్జర్వర్ కే విజయ్‌మోహన్, అబ్జర్వర్లు విజయ్‌కుమార్, శివకుమార్‌తో కలిసి పరిశీలించారు. మల్లేశం మాట్లాడుతూ డిగ్రీ కళాశాలకు వెంకన్న, బండారుపల్లి మోడల్ పాఠశలకు ఎం రమేశ్ చీఫ్ సూపరింటెండెంట్లుగా వ్యవహరించనున్నారని, రెవెన్యూ, పోలీస్, విద్యాశాఖ నుంచి ముగ్గురు సభ్యులతో స్పెషల్ స్క్వాడ్ పర్యవేక్షించనున్నట్లు తెలిపారు.

గుండె మార్పిడి చేసిన మహిళతో నిమ్స్ వైద్యులు

ఏటూరునాగారం వాసికి గుండె మార్పిడి

దాత సాయంతో విజయవంతగా పూర్తి చేసిన నిమ్స్ వైద్యులు

ఏటూరునాగారం, మే 23 : మండలకేంద్రానికి చెందిన షేక్ అక్బర్ భార్య షేక్ షనాజ్‌కు హైదరాబాద్ నిమ్స్ దవాఖానలో వైద్యులు గుండె మార్పిడి ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. వివరాల్లోకి వెళ్తే... ఏటూరునాగారం ప్రాంతానికి చెందిన షేక్ షనాజ్ భర్త, ఇద్దరు పిల్లలతో కలిసి హైదరాబాద్‌లో కొన్నేండ్లుగా నివస్తున్నారు. రెండేళ్లుగా షనాజ్ గుండె ఎడమ జఠరిక వద్ద ఏర్పడిన సమస్య కారణంగా (డైలెటేడ్ కార్డియోమైపతి)తో బాధపడుతున్నారు. కుటుంబ సభ్యులు నిమ్స్ దవాఖాన కార్డియోథోరాసిస్ వైద్యులు అమరేశ్వర్ రావు, గోపాల్‌ను చికిత్స నిమిత్తం సంప్రదించారు. పరీక్షించిన వైద్యులు షనాజ్‌కు గుండె మార్పిడి శస్త్ర చికిత్స చేయాల్సి ఉంటుందని సూచించారు. వైద్యుల సూచన మేరకు షనాజ్ కుటుంబ సభ్యులు జీవన్‌దాన్‌లో ఆమె పేరును నమోదు చేయించారు. రెండు రోజుల క్రితం సికింద్రాబాద్ యశోద దవాఖానలో ఓ మహిళ బ్రెయిన్‌డెడ్ అయినట్లు జీవన్‌దాన్ వైద్య బృందం గుర్తించింది. ఆమె రక్తనమూనాలు షనాజ్‌కు సరిపోవడంతో గుండె మార్పిడికి వైద్యులు ఏర్పాట్లు చేశారు. బుధవారం నిమ్స్ దవాఖాన కార్డియోథోరాసిస్ విభాగాధిపతి డాక్టర్ అమరేశ్వర్‌రావు సారథ్యంలో వైద్య బృందం షనాజ్‌కు గుండె మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేశారు. చికిత్సను విజయవంతంగా పూర్తి చేసిన వైద్యులను నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప అభినందించారు.

ఘనంగా బుద్ధ జయంతి

కృష్ణకాలనీ, మే 23 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం కార్యాలయంలో భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం బుద్ధ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహాసభ జిల్లా అధ్యక్షుడు కోలా శ్యామ్ నాయకులతో కలిసి డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బుద్ధుడి చిత్రపటాలకు పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాన్ని డాక్టర్ అంబేద్కర్ బౌద్ధం నుంచే సేకరించినట్లు చెప్పారన్నారు. కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహాసభ రాష్ట్ర నాయకులు మేకల శ్రీనివాస్, సలహాదారు ముద్దమల్ల భార్గవ్, జిల్లా నాయకులు గొమాస భూమయ్య, కొందికొప్పుల అనిల్, రవికుమార్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

'రెవెన్యూ అధికారులు బెదిరింపులు ఆపాలి'

ములుగురూరల్, మే 23 : పేద గిరిజ కుటుంబాలపై ములుగు రెవెన్యూ అధికారుల బెదిరింపులను ఆపాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీరా వెంకట్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రేమ్‌నగర్‌లో 427/1లో గుగులోత్ సమ్మయ్య, అతని కుమారులు రవి, రాజన్న, శ్రీను, కుమార్తె సరిత ఇల్లు కట్టుకొని ఉంటున్నారని తెలిపారు. 56 ఏండ్ల క్రితం 1958లోనే పెంట ఐలయ్య యాదవ్ దగ్గర భూమిని కొనుగోలు చేశారని తెలిపారు. 2012లో ఇల్లు కట్టుకొని కిరాణం నడుపుతున్నాడని తెలిపారు. రెవెన్యూ అధికారులు సంబంధిత భూమి ప్రభుత్వానిదని, జాకారం శివారు భూ మి అని చెప్పి సోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గిరిజన కుటుంబానికి చెందిన భూమిని అధికారులు అక్రమ కేసులు పెట్టి లాక్కోవాలని చూడడం సరికాదన్నారు. భూమి జోలికి వస్తే పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట గిరిజన శక్తి స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజుయాదవ్, బాధిత కుటుంబ సభ్యులున్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

రఘునాథనల్లి, మే 23 : తండ్రితో జరిగిన చిన్నపాటి గొడవకు మనస్తాపం చెందిన ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చే సుకున్న ఘటన మండలంలోని గోవర్ధనగిరిలో గురువారం చోటుచేసుకుంది. పోలీసు ల కథనం ప్రకారం.. భూపాలపల్లి జిల్లా నే రేడుపల్లికి చెందిన బర్ల హరీశ్ (20) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా డు. ఈ క్రమంలో వరి పంటను రైస్‌మిల్‌కు తరలించే విషయంలో తండ్రి సదయ్యతో ఈ నెల 22న చిన్నపాటి గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన హరీశ్ తన బైక్‌పై గోవర్ధనగిరి శివారులోని దొంతుల సమ్మయ్య వ్యవసాయ క్షేత్రం వద్దకు వచ్చి చింతచెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి అక్క బర్ల దివ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ద ర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దూదిమెట్ల నరేశ్ తెలిపారు. కాగా, హరీశ్ ఆ త్మహత్య చేసుకున్న ప్రదేశంలో రెండు రకాల పురుగుల మందు డ బ్బాలు, ఒక బీరు లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు.

భూములకు పట్టాలు ఇవ్వాలి

ఏటూరునాగారం, మే 23 : మండలకేంద్రంలోని మానసపల్లి శివారులోని సర్వే నెంబర్ 12లో 2006 నుంచి సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు జారీ చేయాలని ఏజెన్సీ దళిత సేవా సంఘం నాయకుడు తిప్పనపల్లి సుదర్శన్ గురువారం ఎంపీడీవో కుమార్, పంచాయతీ కార్యదర్శి రమాదేవికి వినతిపత్రం ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన 50 మంది రైతులు ఈ భూములను ఏళ్ల తరబడి సాగు చేసుకుంటున్నారని చెప్పారు. సమస్యను అర్థం చేసుకొని వెంటనే పట్టాలు ఇవ్వాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో ఏజెన్సీ దళిత సేవా సంఘం నాయకులు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

తాడ్వాయి, మే 23 : మండలంలోని కొడిశాల ప్రా థమిక ఆరోగ్య కేం ద్రాన్ని డీఎంహెచ్ వో అల్లెం అప్ప య్య గురువారం తనిఖీ చేశారు. ఓ పీ, హాజరు రిజిస్టర్ల ను తనిఖీ చేశారు. దవాఖాన ఆవరణలో ఉన్న టాయిలెట్లను పరిశీలించి సూచనలు చేశారు. విధులకు హాజరు కాని సిబ్బందిపై ఆరా తీశారు.

కొనుగోలు కేంద్రాల పరిశీలన

వెంకటాపూర్, మే 23 : మండలంలోని నర్సాపూర్, వెల్తుర్లపల్లి గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా వ్యవసాయ అధికారి విజయచంద్ర, డీసీవో సర్దార్‌సింగ్, ఏవో కల్యాణితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరి కోతల సమయంలో వర్షాలు ఉన్నందున ఉప్పునీరు ద్రావణం పిచికారీ చేయడం వల్ల ధాన్యం మొలకెత్తకుండా కాపాడుకోవచ్చని రైతులకు సూచించారు. వడ్లు దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. వారివెంట మాజీ సర్పంచ్ బొజ్జ జగన్‌మోహన్‌రావు, సీఈవో సుమన్ ఉన్నారు.

పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ములుగు రూరల్, మే 23 : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నోడల్ అధికారి వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షల నిర్వహణకు ఎనిమిది సెంటర్లను ఏర్పాటు చేయగా మొదటి సంవత్సరం 782 మంది, రెండో సంవత్సరం విద్యార్థులు 255 మంది విద్యార్థులు పరీక్ష రాసేందుకు దరఖాస్తు చేసుకున్నారన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ను అమలు చేసినట్లు చెప్పారు.

భూపాలపల్లి జిల్లాలో మోస్తరు వర్షపాతం

భూపాలపల్లి రూరల్, మే 23 : జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో గురువారం ఉదయం 8.30 గంటల వరకు 9.4 మిల్లీ మీటర్ల సగటు వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని చిట్యాల మండలంలో 20.4 మిల్లీ మీటర్లు, రేగొండలో 19.2, మహాముత్తారంలో 12.4, కాటారంలో 11.2, గణపురంలో 10.4, మల్హార్‌లో 9.8, భూపాలపల్లిలో 8.4, మొగుళ్లపల్లిలో 7.6, పలిమెల మండలంలో 4.2 మిల్లీ మీటర్లు నమోదైనట్లు వారు వివరించారు.

పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు

తాళిబొట్టును చూపుతున్న ప్రధాన అర్చకుడు

కమనీయం.. హేమాచలుడి కల్యాణం

■ పట్టు వస్త్రాలు సమర్పించిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి
■ హాజరైన మంత్రి సీతక్క

మంగపేట, మే 23 : లక్ష్మీనర్సింహస్వామి తిరు కల్యాణ బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన స్వామి వారి కల్యాణాన్ని గురువారం మధ్యాహ్నం వేద బ్రాహ్మణుల బృందం కన్నుల పండువగా నిర్వహించింది. కల్యాణోత్సవ వేడుకల్లో భాగంగా ఉదయం లక్ష్మీనర్సిహస్వామికి తిల, తైలాభిషేకాలు జరిపారు. అనంతరం యాగశాలలో సతీసమేతంగా స్వామివారిని ప్రత్యేక పట్టు వస్త్రాలతో అలంకరించి కల్యాణ మండపానికి తీసుకొచ్చారు. భద్రాచలం అర్చకులు అమరవాది మురళీకృష్ణమాచార్యుల బృందం, మల్లూరు ప్రధాన అర్చకులు కైంకర్యం రాఘవాచార్యులు, రాజశేఖరశర్మ కల్యాణ తంతు నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల్లో నుంచే గాక ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చారు. మంత్రి సీతక్క కల్యాణంలో పాల్గొని, పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఆలయ అభివృద్ధి కృషి చేస్తానని తెలిపారు. బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. నర్సింహసాగర్, గాంధీనగర్ గ్రామాల దాతల ఆధ్వర్యంలో మహా అన్నదానం చేశారు. అడిషనల్ కలెక్టర్ శ్రీజ స్వామివారిని దర్శించుకున్నారు. ఏఎస్పీ మహేశ్ గీతే బాబా సాహెబ్ పర్యవేక్షణలో సీఐ రాజు, ఎస్సై రవి కుమార్ బందోబస్తు నిర్వహించారు. వేడుకల్లో ఈవో మహేశ్, మాజీ చైర్మన్లు నూతిలకంటి ముకుందం, పూజారి సమ్మయ్య, పూజారి శ్రీను, భద్రాచలం అర్చక బృందం, స్థానిక అర్చకులు కారంపూడి పవన్ కుమార్ ఆచార్యులు, ఈశ్వర్‌చందుశర్మ, మురళీశర్మ, సీతారాములు, వెంకటనారాయణశర్మ, సుధీర్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలి'

కృష్ణకాలనీ, మే 23 : అబద్ధాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ కు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుతో బుద్ధిచెప్పాలని ఆదిలాబా ద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని దేవి ఫంక్షన్ హాల్‌లో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వెన్నంపల్లి పాపయ్య ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించగా ఎమ్మెల్యే శంకర్, పార్లమెంట్ కన్వీనర్ మురళీధర్‌గౌడ్ హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల పేరుతో మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి చింతపండు నవీన్ బ్లాక్ మెయిల్ చేస్తూ వేల కోట్లు సంపాదించాడని, ఆయనను గెలిపిస్తే పట్టభద్రులను నిండా ముంచుతాడన్నారు. సమావేశంలో నాయకులు కన్నం యుగదీశ్వర్, ప్రభారి విజయరావు, పార్టీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్‌రెడ్డి, చల్లా నారాయణరెడ్డి, రాజమౌళిగౌడ్, సామల మధుసూదన్ రెడ్డి, దొంగల రాజేందర్ పాల్గొన్నారు.

వైభవంగా ఎరుకల నాంచారమ్మ జాతర

■ నైవేద్యం, పట్టు వస్త్రాలు సమర్పించిన జాతర కమిటీ చైర్మన్ రాజు

వెంకటాపూర్, మే 23 : మండలంలోని రామంజాపూర్ గ్రామ పరిధి నాంచారమ్మ జాతర గురువారం వైభవంగా జరిగింది. ఉదయం లక్ష్మీ దేవిపేట నుంచి గడపగడపకూ తీరుగుతూ సంప్రదాయం ప్రకారం అమ్మవారిని తీసుకొచ్చారు. జాతర కమిటీ చైర్మన్ లోకిని రాజు దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలు, నైవేద్యం సమర్పించారు. ములుగు జిల్లా ఎరుకల సంఘం అధ్యక్షుడు కేతిరి భిక్షపతి దంపతులు, ప్రధాన కార్యదర్శి పల్లకొండ భాస్కర్ దంపతులు, కోశాధికారి పాలకుర్తి సురేశ్ దంపతులు పూజలో పాల్గొని నాంచారమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. ఐదుగురు వేద పండితులతో హోమం చేసి నాంచారమ్మకు ప్రత్యేక పూజలు, కళ్యాణ మహోత్సవం నిర్వహించారు. అనంతరం నాలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన ఎరుకల కులస్తులు మొక్కులు చెల్లించారు. నాంచారమ్మ వేషధారణతో ఉన్న చిన్నారులతో పలువురు సోది చెప్పించుకున్నారు. మంత్రి సీతక్క, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. పీసీసీ సభ్యుడు మల్లాడి రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు భగవాన్‌రెడ్డి, ఎంపీపీ రజితా సమ్మయ్య, మాజీ సర్పంచ్‌లు తుమ్మేటి రాజిరెడ్డి, సూర్యనారాయణ, నాంచారమ్మ డైరెక్టర్లు కేతిరి భిక్షపతి, పల్లకొండ భాస్కర్, పాలకుర్తి సురేశ్, కోనేటి రాజు, మానుపాటి రమేశ్, కేతిరి సుభాష్, అంగిడి ప్రశాంత్, లోకిన సమ్మయ్య, లోకిని చందర్, పులి రవీందర్, దేవరాజ్, సమ్మయ్య, రమేశ్, పూర్ణచందర్ పూజల్లో పాల్గొన్నారు. డాక్టర్ భవ్య ఆధ్వర్యంలో జాతర ప్రాంగణంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

జాతర వద్ద పూజలు చేస్తున్న మంత్రి సీతక్క

రాకేశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి

■ మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి రూరల్, మే 23: బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం సింగరేణి జీఎం కార్యాలయం, సింగరేణి ఏరియా దవాఖానలో టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డితో కలిసి ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గండ్ర మాట్లాడుతూ సింగరేణి ఉద్యోగుల పక్షాన మీ సమస్యలపై పోరాటం చేసేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ప్రచారంలో టీబీజీకేఎస్ నాయకులు, కార్యకర్తలు, యూత్ నాయకులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


రాకేశ్‌రెడ్డికి ఓటు వేయాలని కోరుతున్న వెంకటరమణారెడ్డి

సామగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాల ఏర్పాటు

ములుగు అదనపు కలెక్టర్ మహేందర్‌జీ

ములుగురూరల్, మే 23 : ఈ నెల 26న పోలింగ్ సామగ్రి పంపిణీ, స్వీకరణ కేంద్రాలను కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేయనున్నట్లు అదనపు కలెక్టర్ మహేందర్‌జీ తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లో ఆర్డీవో సత్యపాల్‌రెడ్డితో కలిసి సెక్టోరియల్ అధికారులు, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నిర్వాహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. అధికారులు పోలింగ్‌కు ఒక రోజు ముందే క్షేత్ర స్థాయిలో వసతులను చూసుకోవాలని సూచించారు. మెటీరియల్ పంపిణీ రోజే పోలింగ్ కేంద్రాలకు చేరుకొని మరుసటి రోజు పోలింగ్‌కు సిద్ధంగా ఉండాలన్నారు. ఏజెంట్ల సమక్షంలో పోలింగ్ బాక్స్ ఓపెన్ చేసి చూడాలని మహేందర్‌జీ సూచించారు.

కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధ్యాపకులు

గురుకుల కళాశాలల్లో ప్రవేశానికి కౌన్సెలింగ్

ఏటూరునాగారం, మే 23 : ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని గిరిజన గురుకుల కళాశాలలో ప్రవేశానికి స్థానిక గిరిజన గురుకుల క్రీడా పాఠశాలలో గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. వివిధ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేసేందుకు కౌన్సెలింగ్ ద్వారా సీట్లను కేటాయిస్తూ ఆదేశాలు ఇచ్చినట్లు గురుకులాల ఆర్‌సీవో రాజ్యలక్ష్మి ఈసందర్భంగా తెలిపారు. కౌన్సెలిగ్‌లో వివిధ కళాశాలలకు చెందిన ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

నిందితుడి అరెస్టును చూపుతున్న పోలీసులు

ఎండు గంజాయి పట్టివేత

భూపాలపల్లి రూరల్, మే 23 : భూపాలపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 1.100 కేజీల ఎండు గంజాయిని గురువారం పట్టుకున్నట్లు భూపాలపల్లి సీఐ నరేశ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని 5 ఇంక్లైన్ ఆర్చీ వద్ద ఎస్సై సుధాకర్, సిబ్బంది వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో హనుమకొండ జిల్లా కమలాపురం మండలం శనిగరం గ్రామానికి చెందిన నిగ్గల రాజు బైక్‌పై వస్తూ పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయగా అతడిని పట్టుకొని తనిఖీ చేయగా 1.100 కేజీల ఎండు గంజాయి లభించిందని తెలిపారు. నడికూడ మండల కేంద్రానికి చెందిన కుమ్మరి నాగరాజు అలియాస్ రాజు వద్ద కొనుగోలు చేసినట్లు రాజు చెప్పగా, ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని, పూర్తి విచారణ చేస్తున్నామని సీఐ వివరించారు.

విద్యుత్ అంతరాయం ఉండొద్దు

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

జయశంకర్ భూపాలపల్లి, మే 23 (నమస్తే తెలంగాణ) : భూపాలపల్లి కృష్ణకాలనీ ఫీడర్ కింద గురువారం నాలుగున్నర గంటల పాటు వి